GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 14-09-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# మట్టిలో పుట్టిన దేవుడు.. మట్టినే కాపాడమంటున్నాడు

## భక్తి పేరుతో ప్రకృతికి విఘాతం వద్దు.. మట్టి గణపతితోనే సంప్రదాయానికి పునఃవైభవం

■ క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో :-

వినాయకుడు.. విఘ్నాలను తొలగించే దేవుడు. ఏ పూజవైనా.. ఏ శుభకార్యమైనా తొలి పూజ ఆయనకే. వినాయక చవితి వచ్చిందంటే చాలు.. ఊరూవాడా పండుగ వాతావరణం. ఇళ్లలో పూజలు.. వీధుల్లో మండపాలు.. గణనాథుడి నామస్మరణతో సందడి.

మిగతా 2లో







# పల్లెల్లో పండగ జోష్..!



- లాంభోదరుడి భక్తిగీతాలతో మార్మోగనున్న ఊరు వాడ
- సుముహూర్తంలో గణనాథుడి తొలి పూజలకు ఘన ఏర్పాట్లు
- విద్యుత్ దీపాల అలంకరణలతో సరికొత్త శోభ
- శివాకేశవ ఆలయంలో వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గణేష్ ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. నేటి నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల కోసం జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో గణపతి మండపాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. వివిధ ఆకృతుల్లో మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి



మిగతా 5లో

# "డ్రగ్స్ వద్దు.. స్పోర్ట్స్ ముద్దు!"

- పటాన్‌చెరులో 2 వేల మంది క్రీడాకారుల కదనభేరి
- మాదకద్రవ్యాలను తరిమికొట్టాలి.. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంచాలి
- క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



4లో

# మట్టిలో పుట్టిన దేవుడు.. మట్టినే కాపాడమంటున్నాడు



భక్తి వెల్లువలో మనం ఒక విషయాన్ని మాత్రం మరిచిపోతున్నాం. విఘ్నాలను తొలగించే వినాయకుడి పండుగే.. ప్రకృతికి విఘ్నంగా మారకూడదు కదా? భక్తితో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాన్ని నిమజ్జనం పేరుతో చెరువులు, నదుల్లో వదులుతున్నాం. పూజా సామగ్రి, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలూ నీటిలో కలుస్తున్నాయి. ఇప్పటికే కాలుష్యంతో సతమతమవుతున్న జల వనరులపై పండుగ పేరుతో మరో భారం పడుతోంది. భక్తి అంటే ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం కాదు. దేవుడిని పూజించడంతో పాటు ఆయన సృష్టించిన ప్రకృతిని కాపాడటమూ మన బాధ్యతే.

**మట్టితో మమేకమైన సంప్రదాయం**

మట్టి గణపతి కొత్తగా వచ్చిన ఆలోచన కాదు. మన పూర్వీకుల ఆచారంలోనే దానికి స్థానం ఉంది. సహజ మట్టితో విగ్రహాన్ని తయారు చేయడం.. పూజించడం.. అనంతరం అదే మట్టిలో కలపడం వెనుక ప్రకృతితో మనిషి అనుబంధాన్ని గుర్తుచేసే తాత్వికత ఉంది.

**మట్టి నుంచి పుట్టిన మనిషి.. చివరికి మట్టిలోనే కలుస్తాడు.**

ఈ సత్యాన్ని గుర్తుచేసే మట్టి గణపతి సంప్రదాయం నేడు క్రమంగా కనుమరుగవుతోంది. దాని స్థానంలో భారీ విగ్రహాలు.. భారీ మండపాలు.. హంగులు.. ఆర్భాటాలు వచ్చాయి. విగ్రహం ఎత్తు పెరిగింది.. ఖర్చు పెరిగింది.. పోటీ పెరిగింది. కానీ భక్తి అంతే స్థాయిలో పెరిగిందా అన్నది ప్రశ్న.

**దేవుడికి కావాల్సింది భారీ విగ్రహం కాదు.. స్వచ్ఛమైన భక్తి.**

**పీఓపీతో పెరుగుతున్న ముప్పు**

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారైన విగ్రహాలు సహజ మట్టి విగ్రహాల్లా సులభంగా కరిగిపోవు. వాటికి వేసే పూతలు, రంగులు, ఇతర పదార్థాలు కూడా నీటి నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నిమజ్జనం తర్వాత మిగిలే విగ్రహాల అవశేషాలు జల వనరుల్లో పేరుకుపోతాయి. దీనికి తోడు పూజా సామగ్రి, ప్లాస్టిక్ సంచులు, థర్మాకోల్, వస్త్రాలు వంటి వ్యర్థాలు కూడా నీటిలో కలుస్తున్నాయి. ఒకవైపు చెరువులు, నదులు, కాలువలు ఇప్పటికే మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నాయి. మరోవైపు పండుగల సందర్భంగా కూడా వాటిలోకి వ్యర్థాలు చేరుతున్నాయి. దేవుడిని పూజించిన నీటినే.. మరుసటి రోజు మనమే ఉపయోగించుకోవాలి. అలాంటప్పుడు ఆ నీటిని కలుషితం చేయడం ఎంతవరకు సమంజసం?

**పండుగ మనదే.. బాధ్యతా మనదే**

**వినాయక చవితి ఒక్కరోజు పండుగ కావచ్చు. కానీ మన నిర్ణయాల ప్రభావం మాత్రం ఏడాది పొడవునా ఉంటుంది.**

**మనం ఎంచుకునే విగ్రహం.. వేసే అలంకరణ.. చేసే నిమజ్జనం.. అన్నీ పర్యావరణంపై ప్రభావం చూపుతాయి.**

**అందుకే ఈసారి గణనాథుడిని భక్తితో పూజిద్దాం. అదే సమయంలో ప్రకృతిని కూడా గౌరవిద్దాం.**

**వినాయకుడిని పూజించడం భక్తి అయితే.. ఆయన సృష్టించిన ప్రకృతిని కాపాడటం మన ధర్మం.**

**మట్టి గణపతిని ఇంటికి తెద్దాం..**

**మన మట్టిని కాపాడుకుందాం.**

**నీటి వనరులను కలుషితం చేయకుండా..**

**భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందిద్దాం.**

**ఈ వినాయక చవితి.. భక్తితో పాటు బాధ్యతకు కూడా పండుగ కావాలి.**

**భక్తికి కొలమానం ఆర్భాటం కాదు**

వినాయకుడికి భారీ విగ్రహమే కావాలా? భారీ శబ్దాలు.. లైటింగ్.. ఆర్భాటాలే భక్తికి కొలమానాలా కాదు. గరిక, పత్రి, పుష్పాలు.. ఉండ్రాళ్లు.. మనస్ఫూర్తిగా చేసే ప్రార్థన.. కుటుంబమంతా కలిసి జరుపుకునే పండుగ.. ఇవే వినాయక చవితి అసలైన అందం. పండుగలో పోటీ ఉండొచ్చు. కానీ ప్రకృతితో పోటీ వద్దు. విగ్రహం పెద్దదవుతున్న కొద్దీ భక్తి పెరగాల్సిన అవసరం లేదు. మనసు పెద్దదైతే చాలు.

**ఈసారి మారుదాం**

ఈ వినాయక చవితి నుంచి చిన్న మార్పు మొదలుపెడదాం.

**మట్టి గణపతిని ఎంచుకుందాం:**

సహజ మట్టితో తయారైన విగ్రహాలకు ప్రాధాన్యం ఇద్దాం. స్థానిక కుమ్మరి కుటుంబాలను ప్రోత్సహిద్దాం. మన పండుగ వారి జీవనోపాధికి కూడా తోడ్పడేలా చూద్దాం.

**సహజ పదార్థాలతో అలంకరిద్దాం:**

ప్లాస్టిక్, థర్మాకోల్‌ను వీలైనంత వరకు దూరం పెట్టి.. పూలు, ఆకులు, మామిడి తోరణాలు, అరటి ఆకులు వంటి సహజ పదార్థాలను ఉపయోగిద్దాం.

**బాధ్యతగా నిమజ్జనం చేద్దాం:**

పూజా సామగ్రి, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను నదులు, చెరువుల్లో వేయకూడదు. స్థానిక సంస్థలు ఏర్పాటు చేసే నిమజ్జన కేంద్రాలు, కృత్రిమ కొలనులను వినియోగిద్దాం. సాధ్యమైన చోట ఇంట్లోనే మట్టి గణపతిని నిమజ్జనం చేసి.. ఆ మట్టిని మొక్కలకు వినియోగించవచ్చు. ఇది పండుగను తగ్గించడం కాదు. పండుగను మరింత అర్థవంతంగా మార్చడం.



## సొంత నిధులతో కమాన్ నిర్మించి ఆదర్శంగా నిలిచిన మాజీ కౌన్సిలర్

**గోక అనిరుధ్‌రెడ్డి సేవా దృక్పథాన్ని అభినందించిన స్థానికులు**

**శశికళ యాదవ్‌రెడ్డి చేతుల మీదుగా కమాన్ ప్రారంభం**

**అమీన్‌పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 13:** స్థానిక అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూ అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గోక అనిరుధ్‌రెడ్డి సొంత నిధులతో నిర్మించిన నూతన కమాన్ బీరంగూడలో ప్రారంభమైంది. బీరంగూడ డివిజన్ పరిధిలోని ఎన్ఎస్ఎల్ కాలనీ నుంచి వెంకటేశ్వరస్వామి గుడి గుట్టకు వెళ్లే ప్రధాన రహదారిపై నిర్మించిన ఈ కమాన్‌ను ఆదివారం మహిళా కమిషన్ సభ్యురాలు శశికళ యాదవ్‌రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు, స్థానికులకు స్వాగత సూచికగా ఈ కమాన్ నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధికి ఇది ప్రతీకగా ఉంటుందని తెలిపారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సొంత నిధులతో కమాన్ నిర్మించి సహకరించిన గోక అనిరుధ్‌రెడ్డిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో బీరంగూడ గుట్ట ఈఓ దేవానందం, ఆలయ కమిటీ చైర్మన్ బైన సుధాకర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి**



**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 09:** పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రకృతికి హాని కలిగించని మట్టి వినాయకులనే పూజించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి పిలుపునిచ్చారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని భారత నగర్ కాలనీలో స్థానికులతో కలిసి ఆయన మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల జల వనరులు కలుషితమై మూగజీవాలతో పాటు మానవ మనుగడ కూడా ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మన పూర్వీకులు నేర్పిన సంప్రదాయ పద్ధతిలో మట్టితో చేసిన ప్రతిమలను పూజించడమే భారతీయ సంస్కృతి అని స్పష్టం చేశారు. కాలనీ వాసులలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుండడం శుభపరిణామమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని కోరారు.



# వినాయక చవితి నవరాత్రులు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 13 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వినాయక మండపాలలో జరిగే పూజా కార్యక్రమంలో పాల్గొనాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ ను పలు మండప నిర్వాహకులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. అనంతరం జిల్లా గణేష్ మాట్లాడుతూ ప్రజలందరికి వినాయక చవితి శు భాకాంక్షలు తెలియజేశారు. అంతేకాక రేపటి నుండి జరుపుకునే వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో ప్రతి కాలనీలో పూజా కార్యక్రమాలు ఆ విఘ్నేశ్వరుడు అందుకుంటాడని, ఆదిదేవుడైన విగ్నేశ్వరుడు మన విఘ్నాలను రూపుమాపి సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగజేయాలని కోరుకున్నారు. వినాయక మండపాలను నిర్వహించే కమిటీ సభ్యులు ఈ తొమ్మిది రోజుల కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు, ట్రాఫిక్ సమస్యలు కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీ వినాయక మండప కమిటీ సభ్యులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మట్టి గణపతులను పూజించాలి

**కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 13 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బి కాలనీ, వసంత నగర్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో మట్టి గణపతులను ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టిపిసిసి ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ చేతుల మీదగా వినాయక మట్టి విగ్రహాలను సర్దార్ పటేల్ నగర్, భగత్ సింగ్ నగర్, వసంత నగర్, మలేషియన్ టౌన్షిప్, గోపాల్ నగర్, విశ్వాంబరి షీలా పార్క్ కాలనీ నందు వినాయక మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ వినాయక భాద్రపద మాసంలో వినాయక చవితి సందర్భంగా ప్రతి వ్యక్తి ప్రతి పౌరుడు పర్యావరణాన్ని సంస్కృతిని కాపాడాలంటే మట్టి గణనాథుల్ని పూజించాలని తెలియజేశారు. అదేవిధంగా మట్టి గణనాథులను ఇంట్లోని స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం చేసి ఆ మట్టిని మొక్కలకు వేయటం ద్వారా గా పర్యావరణహితము, మొక్కలకు ఎరువు ఏర్పడుతుంది కాబట్టి పవిత్రంగా ఆ స్వామి ప్రతిమలను మంచినీటిలో నిమజ్జనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిలారి బాబు, మలేషియన్ టౌన్షిప్ అధ్యక్షులు కాకర్ల సురేష్ చౌదరి, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య,చావా శ్రీనివాసరావు ,కొడప రామారావు, కాజా నవీన్, చిలుకూరి గోవిందరాజు, రామ్ చౌదరి, లెక్చరర్ గా శ్రీనివాస్, నల్లమోతు ఫణి, శేషారావు, సురేష్, గంటా భీమేశ్వరరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంద్రేశంలో ఉచిత కంటి వెలుగు క్యాంప్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 13:** ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇంద్రేశం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాయల్ ఎన్ఆర్ఐ సిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఫెన్నర్ పరిశ్రమ సహకారంతో ఈ ఉచిత కంటి వెలుగు క్యాంప్‌ను నిర్వహించారు. ఈ శిబిరానికి స్థానిక కాలనీల నుంచి వందలాది మంది ప్రజలు తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్య బృందం శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి సమస్యలు, కంటి సంబంధిత ఇబ్బందులను గుర్తించింది. వయసు పెరుగుతున్న కొద్దీ ఎదురయ్యే దృష్టి లోపాలు, ఇతర కంటి సమస్యలపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్యం తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులను నివారించవచ్చని సూచించారు. ఎల్వీ ప్రసాద్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించగా, శిబిరానికి హాజరైన ప్రజలకు అవసరమైన వైద్య సలహాలు అందించారు. కంటి పరీక్షల్లో గుర్తించిన సమస్యలకు అనుగుణంగా వైద్యుల సూచనలు, అవసరమైన మందులను అందజేశారు. మరింత వైద్య చికిత్స అవసరమైన వారికి తదుపరి పరీక్షలు, చికిత్సకు సంబంధించిన సూచనలు ఇచ్చారు. కంటి చూపులో స్వల్ప మార్పులు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు కంటి పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు. కంటి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు శిబిరంలో పలు సూచనలు చేశారు. ఇంద్రేశం పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం



వ్యక్తం చేశారు. ఖరీదైన వైద్య పరీక్షలను చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యానికి పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు ముందుకు వచ్చి మరిన్ని ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని స్థానికులు కోరారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి సహకరించిన వైద్య బృందం, ఫెన్నర్ పరిశ్రమ ప్రతినిధులు, నిర్వాహకులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయల్ ఎన్ఆర్ఐ సిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఏ. రాజు, ఉపాధ్యక్షుడు మనోహర్ గౌడ్ జనరల్ సెక్రటరీ కె రమేష్, కోశాధికారి జి.ప్రకాష్, కార్యదర్శి వై అనిల్, జాయింట్ సెక్రటరీ నవాజ్ రెడ్డి, సభ్యులు గోవర్ధన్ రెడ్డి ప్.రమేష్ అడ్వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఐక్య పోరాటాలే ఏచూరికి అర్పించే నివాళి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఐక్య పోరాటాలే సీతారాం ఏచూరికి అర్పించే నిజమైన నివాళి అని న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ స్పష్టం చేశారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం నేత సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ?వర్తమాన పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నూతన పోరాట వేదికలను మలచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఫాసిస్టు ధోరణులు, సిద్ధాంతాలతో పరిపాలిస్తున్న పాలకులు శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు రకరకాల కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ వంటి చర్యలు చూసేవారమని, కానీ నేటి పాలకులు బహిరంగంగా ఓటర్ల జాబితాలనే తారుమారు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ?ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరిట రాత్రికి రాత్రే గ్రామీణ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఓటర్లు మాయమైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఓట్లు తొలగించబడ్డాయనే విషయం కూడా సామాన్య ప్రజలకు తెలియని పరిస్థితి కల్పించారని, తిరిగి ఆ ఓటు హక్కును పొందేందుకు దరఖాస్తులు చేసుకుంటూ కోర్టులు, అధికారుల చుట్టూ తిరగడం ఎంతో ప్రయాసతో కూడుకున్న పనిగా మారిందని పేర్కొన్నారు. అధికార బలం, ధనబలం, ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ఎన్నికల సంఘం వంటి వ్యవస్థలను కూడా తమకు అనుకూలంగా మార్చుకుని పాలకులు విసురుతున్న కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గతంలో సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కుతంత్రాలను బట్టబయలు చేస్తూ, బూత్ స్థాయిలో ప్రజలను సమీకరించి వారి ఓటు హక్కును కాపాడేలా చైతన్యపరచడమే ముందున్న మనం చేపట్టాల్సిన ప్రధానమైన పోరాటమని పురకాయస్థ వివరించారు ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్ కేవలం సమాచార మార్పిడి సాధనం మాత్రమే కాదని, అది వ్యక్తుల భావప్రకటన, స్వేచ్ఛ, జీవన విధానంలో అంతర్భాగంగా మారిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న జెన్-జీ




నిరసనల నేపథ్యంలో సెల్‌ఫోన్ల ప్రాధాన్యతను విశ్లేషిస్తూ కీలక విషయాలను వెల్లడించారు. మొబైల్ ఫోన్లు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాన ఆలోచనలు కలిగిన వ్యక్తులు ఏకమవుతుండమే కాకుండా, తమ సంతోషాలు, బాధలు, నిరసనలను వ్యక్తపరుస్తున్నారని పేర్కొన్నారు. నిరంకుశ విధానాలను అవలంబించే ప్రభుత్వాలు లేదా నాయకులను హాస్యం, వ్యంగ్య చిత్రాలు (కార్టూన్లు), సందేశాల ద్వారా ప్రశ్నించే శక్తిని ఈ డిజిటల్ సాధనం సామాన్యులకు అందించిందని తెలిపారు. ఇటువంటి సున్నితమైన భావప్రకటనలను అణిచివేయడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈనాటి జెన్-జీ యువత సాంకేతికతతోనే పెరిగారని, పరీక్షల పేపర్ లీకేజీలు వారి భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ లౌకిక, సమాఖ్య సూత్రాలను కాపాడటమే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అని సీపీఎం సీనియర్ నేత తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య వ్యవస్థ నిలబడాలంటే లౌకికవాదం, సమాఖ్యవాదం, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం అనే నాలుగు కీలక సూత్రాలు అమలు కావాలని తమ్మినేని స్పష్టం చేశారు. ప్రభుత్వ పరిపాలన, విద్యా వ్యవస్థ, రాజకీయ పార్టీలు మతానికి దూరంగా ఉండాలని, కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం లౌకిక విలువలను తూట్లు పొడుస్తూ మతాన్ని రాజకీయం చేస్తోందని విమర్శించారు. భారత్ విభిన్న సంస్కృతులు, భాషల సమాహారమని, కేంద్రంలోనే అధికారాలు కేంద్రీకృతం కాకుండా రాష్ట్రాలకు, పంచాయతీలకు నిధులు, అధికారాలు వికేంద్రీకరించాలని పేర్కొన్నారు.

# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** పేద ప్రజల అభ్యున్నతికై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ప్రజా పాలనలో భాగంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 24 మందికి చెక్కులను ఆదివారం నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ సీనియర్ జిల్లా నాయకులు పూల వెంకటయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. మండలంలోని పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వివిధ రుగ్మతులతో వైద్య చికిత్స చేయించుకున్న పేద వారికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహాయ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 24 మంది లబ్ధిదారులకు ఎనిమిది లక్షల ఇరవై రెండు వేల రూపాయలు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు పానుగంటి వెంకటయ్య, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు కోరె



యాదయ్య, జంపాల సైదులు, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగరాజు కామి శెట్టి యాదయ్య (చత్రపతి) మహిళా నాయకులు బిరుదోజు యాదమ్మ, తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# "డ్రగ్స్ వద్దు.. స్పోర్ట్స్ ముద్దు!"




**పటాన్‌చెరులో 2 వేల మంది క్రీడాకారుల కదనభేరి**

**మాదకద్రవ్యాలను తరిమికొట్టాలి..**

**విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంచాలి**

**క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 13:** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం కోసం విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మల్లీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్ సౌజన్యంతో ఛాంపియన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్‌రెడ్డి స్మారక ప్రథమ జాతీయస్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీలను ఎమ్మెల్యే జీఎంఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటాన్‌చెరు కేంద్రంగా జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2,000 మంది క్రీడాకారులు పాల్గొనడం పటాన్‌చెరు నియోజకవర్గ ఖ్యాతిని నలుదిశలా చాటిందన్నారు. చిన్ననాటి నుంచే తనకు క్రీడలపై ఎంతో మక్కువ ఉందని, నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పటాన్‌చెరు మైత్రి మైదానాన్ని ఆధునీకీకరించడంతోపాటు ఏడాది పొడవునా రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల కోసం నియోజకవర్గవ్యాప్తంగా మూడు మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాలు



అత్యంత ప్రమాదకరంగా మారాయని, వాటిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. క్రీడాకారులకు అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. జాతీయస్థాయి పోటీల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యే జీఎంఆర్‌కు నిర్వాహకులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు నర్రా భిక్షపతి, వెంకటేష్, రామ్మోహన్, షకీల్, చంద్రకుమార్, కరాటే మాస్టర్లు లక్ష్మణ్, రాజు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.




# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**క్రైమ్ మిర్రర్ , నేరేడుచర్ల:** లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో నేరేడుచర్ల మెయిన్ రోడ్డు సెంటర్‌లో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు రావులపల్లి ప్రసాద్ ఆర్థిక సహాయంతో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బట్టు మధు, చల్లా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను అందజేయడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. మట్టి విగ్రహాల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బోనగిరి అంజయ్య బాల వెంకటేశ్వర్లు రాచకొండ విజయలక్ష్మి ,రాచకొండ రామ కోటేశ్వరరావు ,ఇంపాక్ట్ వీరవల్లి శ్రీలత, నగేష్ జెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పేదరికం చదువుకు అడ్డంకి రాకూడదు : గోలి లింగస్వామి

**పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసానిచ్చిన లింగస్వామి**

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనుకునే పేద విద్యార్థులకు నిరంతరం చేయూతనందిస్తామని బిజెపి నాయకులు గోలి లింగస్వామి తెలిపారు. నల్గొండ జిల్లా మునుగోడు మండల పరిధిలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన బోసి నవ్య తండ్రి వెంకన్న, రేవెల్లి నవ్య తండ్రి యాదయ్య అనే విద్యార్థినులు కానిస్టేబుల్ ఉద్యోగ పోటీ పరీక్షల కోసం కోచింగ్ తీసుకుంటున్నారు. వారి ఆర్థిక పరిస్థితులను గమనించిన గోలి లింగస్వామి, ఆ విద్యార్థుల భవిష్యత్తుకు ఆర్థికంగా మరియు మానసికంగా భరోసానిచ్చారు. తమ గ్రామానికి చెందిన పేద విద్యార్థినుల చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో 10 వేల నగదు ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యం ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా గోలి లింగస్వామి మాట్లాడుతూ... "పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు. కష్టపడి చదివి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించి సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బొడిగె అశోక్, నాయకులు గాదె నరేష్, బాతరాజు గోవిందు, కొండగిరి వేణు, ఆదేపు వెంకన్న, సంపంగి నరసింహ, పులకరం శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు..





# సోలార్ పెట్టండి.. కరెంట్ బిల్లు తగ్గించండి!

**సోలార్‌తో కరెంట్ బిల్లులకు చెక్!**

**సంగారెడ్డిలో భారత్ ఈవీ సోలార్ లిమిటెడ్ బ్రాంచ్ కార్యాలయం ప్రారంభం**

**సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి: జగ్గారెడ్డి**

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 13: విద్యుత్ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణతోపాటు విద్యుత్ ఖర్చులను తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ వ్యవస్థల వైపు దృష్టి సారించాలని సూచించారు. సంగారెడ్డి పట్టణంలో భారత్ ఈవీ సోలార్ లిమిటెడ్ బ్రాంచ్ కార్యాలయాన్ని జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ అవసరాలకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ సౌకర్యాలను కల్పిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడం తోపాటు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సౌర విద్యుత్ వినియోగం ఎంతో ఉపయోగకరమన్నారు. భవిష్యత్తులో విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు అడుగులు వేయాలని సూచించారు. భారత్ ఈవీ సోలార్ లిమిటెడ్ ద్వారా గృహ అవసరాలకు అనుగుణంగా ఒక కిలోవాట్ నుంచి 10 కిలోవాట్ల వరకు వివిధ సామర్థ్యాలతో సోలార్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు ప్రసాద్, కళ్యాణ్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సబ్సిడీకి అర్హత ఉన్న వినియోగదారులకు సంబంధిత ప్రయోజనాలు లభిస్తాయని పేర్కొన్నారు. సంగారెడ్డిలో బ్రాంచ్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు సోలార్ విద్యుత్ వ్యవస్థలపై అవగాహన, సలహాలు, సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, రమేష్, కంపెనీ ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**చిట్యాల:** చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన పెరుమాండ్ల మల్లమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మల్లమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తక్షణ సాయంగా రూ.10 వేల నగదును అందజేశారు. అవసరమైన సమయంలో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ గాలి యాదమ్మ లింగయ్య, కాంగ్రెస్ నాయకులు జిట్టా చంద్రకాంత్, స్వామి పాల్గొన్నారు.

# 3,793 కేసులకు లోక్‌అదాలత్‌లో పరిష్కారం

**సైబర్ బాధితులకు రూ.50.13 లక్షలు తిరిగి అందేలా కోర్టు ఆదేశాలు**

**జిల్లా పోలీసులను ప్రశంసించిన ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 13:** జాతీయ మెగా లోక్‌అదాలత్‌కు సంగారెడ్డి జిల్లాలో అపూర్వ స్పందన లభించింది. జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న, రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో మొత్తం 3,793 కేసులకు పరిష్కారం లభించింది. లోక్‌అదాలత్ ద్వారా ఇరు వర్గాలను రాజీకి తీసుకురావడంతో పాటు పలు కేసుల్లో జరిమానాలు విధించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 819 ఐపీసీ కేసుల్లో ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చినట్లు ఎస్పీ వెల్లడించారు. అలాగే 1,135 ఈ-పెట్టి కేసులు, 1,839 డీడీ కేసుల్లో అడ్మిషన్/జరిమానా విధింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. సైబర్ నేరాల బాధితులకు కూడా లోక్‌అదాలత్ ద్వారా ఊరట లభించింది. జిల్లాలో నమోదైన 58 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.43.50 లక్షలు, ఎఫ్ఐఆర్ నమోదు కాని మరో 73 కేసుల్లో రూ.7.80 లక్షలు బాధితులకు తిరిగి అందేలా కోర్టు నుంచి అనుమతులు పొందినట్లు ఎస్పీ తెలిపారు. మొత్తంగా రూ.50.13 లక్షల సైబర్ మోసాల సొమ్మును బాధితులకు తిరిగి అందించేందుకు న్యాయపరమైన మార్గం సుగమమైందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ సూచిస్తూ క్షణికావేశంలో జరిగే తప్పులను సరిదిద్దుకునేందుకు లోక్‌అదాలత్ మంచి అవకాశమన్నారు. అనవసర గొడవలకు వెళ్లి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోవద్దని సూచించారు. రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో ఇరు వర్గాలు ముందుకు వచ్చి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవడం ఉత్తమమన్నారు. జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది చూపిన సమన్వయం, అంకితభావం, సేవా దృక్పథాన్ని ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రశంసించారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పోలీసులు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఇలాంటి సేవలతో జిల్లా పోలీసులపై ప్రజల్లో విశ్వాసం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. లోక్‌అదాలత్ విజయవంతానికి కృషి చేసిన వర్టికల్ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేష్, డీ4సీ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, లైజనింగ్ అధికారి ఎస్ఐ సత్యనారాయణ, కోర్టు డ్యూటీ అధికారులు, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# పల్లెల్లో పండుగ జోష్..!!





గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి సుముహూర్తంలో తొలి పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. గణేష్ ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటోంది. మండపాల ఏర్పాటు నుంచి అలంకరణల వరకు యువకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రేపటి నుంచి లాంభోదరుడి భక్తిగీతాలు, భజనలు, జై గణేశ్ నినాదాలతో పల్లెలు, పట్టణాల్లో పండుగ సందడి నెలకొననుంది. చిన్నారులు, మహిళలు, భక్తులు సైతం గణనాథుడి పూజల్లో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**సూరారం శివాకేశవ ఆలయంలో ప్రత్యేక పూజలు**

మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలోని శ్రీ శివాకేశవ ఆలయంలోనూ వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అర్చకులు వంగల సత్యనారాయణ చార్యులు వేదమంత్రోచ్చారణల మధ్య గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సుముహూర్తంలో గణపతిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో తొలి పూజలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాల్లో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. నేటి నుంచి ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాల నేపథ్యంలో జిల్లాలోని ప్రతి పల్లెలో పండుగ వాతావరణం నెలకొననుంది. గణపతి బప్పా మోరియా నినాదాలతో ఊరు వాడ మార్మోగనుండగా.. యువత ఉత్సాహం, భక్తుల సందడితో గణనాథుడి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగనున్నాయి.



## జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ.

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 13:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రాచలం దుర్గమ్మ ఆలయం బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద భక్తులు, ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. జేడీ ఫౌండేషన్ చైర్మన్ జేడీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని వారు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గమ్మ ఆలయ ప్రధాన అర్చకులు శివకోటి విశ్వనాథ శర్మ, జేడీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హన్సీ వేమూరి, సభ్యులు పవన్ వేమూరి, కడాలి నాగరాజు, యూసఫ్ మియా, ముదిగొండ రమణ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి గణనాథులను ఏర్పాటు చేసుకోని పూజించాలి

**తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అందరూ మట్టి వినాయకులను ఏర్పాటు చేసుకోని పూజించుకోవాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్యాలయం ఆవరణలో ఆదివారం మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పూజించడం సనాతన ధర్మం ఆనవాయితీ అన్నారు. పంచభూతాలోల్ల ఒకటైన భూమి నుంచి వచ్చే మట్టితో చేసిన గణపతిని పూజించడం భూతల్లిని పూజించడంతో సమానమని మట్టి గణపతులతో నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. ముక్కోటి దేవతల్లో మొదటి పూజ అందుకునే గణనాథుడిని ప్రత్యేకంగా మట్టితో చేసిన ప్రతిమలను పూజించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు అడికే జనార్దన్, శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్ గౌడ్, రామారావు, ప్రభుదాస్, రమేష్‌రెడ్డి, సురేష్, రాంబాబు, శేఖర్, మహమూద్, శంకర్‌రెడ్డి, మాణిక్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# జై రవీందర్ సేవలు చిరస్మరణీయం





**తెలంగాణ ఉద్యమం, సింగరేణి కార్మికుల కోసం విశేష కృషి**

**మందమర్రిలో సంతాప సభ.. బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, రేణిగుంట్ల ప్రవీణ్ సహా పలువురి నివాళి**

**మందమర్రి,సెప్టెంబర్,13 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ ఉద్యమ నాయకుడు, రాష్ట్ర జేఏసీ నాయకుడు, బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు జై రవీందర్ (రవన్న) సేవలు చిరస్మరణీయమని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. జై రవీందర్ అకాల మరణం పార్టీకి, సింగరేణి బొగ్గుగని కార్మిక లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. మందమర్రి పట్టణ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం బాల్క సుమన్ ఆధ్వర్యంలో జై రవీందర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణిగుంట్ల ప్రవీణ్ సహా పలువురు నాయకులు రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ఉద్యమంలో ముందుండి..

బాల్క సుమన్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో జై రవీందర్ మందమర్రి ప్రాంతంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతంతోపాటు సింగరేణి కార్మికుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పంపిన సంతాప సందేశాన్ని సభలో చదివి వినిపించారు. సింగరేణి ప్రాంతంలో కార్మిక పోరాటాలు, పార్టీ కోసం జై రవీందర్ అందించిన సేవలు మరువలేనివని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిపారు. రవీందర్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### సొంత అన్నదమ్ముల్లా కలిసి ఉండే వాళ్ళం. దుర్గం చిన్నయ్య

జై రవీందర్ తనకు ఎంతో ఆత్మీయుడని, కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా కలిసిమెలిసి ఉండేవారని గుర్తుచేసుకున్నారు. 1995, 2001 స్థానిక సంస్థల ఎన్నికల సమయం నుంచి రవీందర్‌తో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు సొంత అన్నదమ్ముల్లా కలిసి ఉన్నామని పేర్కొన్నారు. రవీందర్ మృతి తనను తీవ్రంగా కలచివేసిందన్నారు.

### కార్మికుల కోసం పోరాటం

రేణిగుంట్ల ప్రవీణ్ మాట్లాడుతూ.. జై రవీందర్ లాంటి ఆప్తమిత్రుడు, ఉద్యమ నాయకుడిని కోల్పోవడం తీవ్రంగా బాధ కలిగించిందన్నారు. 1996 సింగరేణి ఒప్పందాల సమయంలో కార్మికుల తరఫున నిలబడి రవీందర్ పోరాడారని గుర్తుచేశారు. 2003లో టీబీజీకేఎస్ సంఘం ఆవిర్భావంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. రామకృష్ణాపూర్‌లో ఎన్నో అడ్డంకులు ఎదురైనా ధైర్యంగా నిలిచి తెలంగాణ జెండా గద్దెను నిర్మించిన ఉద్యమకారుడిగా రవీందర్ సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

### పలువురి నివాళి

ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ట్రేడ్ యూనియన్ నాయకులు, జై రవీందర్ అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని, రవీందర్ సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

# గణేష్ మండపాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం

**- భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలి**

**- రాయదుర్గం సీఐ భూపతి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గణేష్ మండపాల నిర్వాహకులతో రాయదుర్గం పోలీసులు నేడు మణికొండ మర్రిచెట్టు కమ్యూనిటీ హాల్ ల్ వద్ద ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రాయదుర్గం సీఐ భూపతి, ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గణేష్ మండపాల నిర్వాహకులకు ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ భూపతి మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే డీజేలకు అనుమతి లేదని, అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లను వినియోగించరాదని, ప్రభుత్వం మరియు పోలీసుల నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత సమయాల్లోనే శబ్ద వ్యవస్థలను వినియోగించాలని సూచించారు. మండపాల వద్ద భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై కూడా ఉందని సీఐ భూపతి పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటారని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. ఈ సమావేశంలో మణికొండ నాయకులు, గణేష్ మండపాల నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రాందేవ్‌బాబా జయంతోత్సవ వేడుకలు

**ప్రత్యేక పూజలు చేసిన రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి**


**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాందేవ్‌బాబా జన్మదినాన్ని పురస్కరించుకోని ఆరాంఘర్‌లోని శ్రీరాందేవ్ బాబా ఆలయంలో రాందేవ్ బాబా జన్మదినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమదేవితో పాటు ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో కులమతాలకు అతీతంగా సమతా భావాన్ని, మానవత్వాన్ని చాటిన మహనీయుడు శ్రీరాందేవ్‌బాబా అని కొనియాడారు. బాబా దీవెనలతో రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్, గుమ్మడి కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నోముల రాముయాదవ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ యువజన అధ్యక్షులు అక్కెం రఘు యాదవ్, రాజేష్‌యాదవ్, మైసిరెడ్డి, ఎస్.అశోక్‌కుమార్, రామస్వామి, ప్రవీణ్, చింరజీవి, రవీందర్‌యాదవ్, వినోద్, శేఖర్, దేవాలయ కమిటీ సభ్యులు శ్యామ్‌సుందర్, కమల్, ధరం, శ్యాంసుందర్ అగర్వాల్, శ్యాంప్రధాన్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## బాబుల్ రెడ్డినగర్‌లో మట్టి వినాయకుల పంపిణీ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బాబుల్ రెడ్డినగర్‌లో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా చెరువులు, నీటి వనరులు కాలుష్యం కాకుండా కాపాడుకోవచ్చని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ వార్డు సభ్యుడు సోమ శ్రీనివాస్ గుప్తా, కాళిదాస్, రవి ముదిరాజ్, రాయుడు, జీహెచ్ఎంసీ జయప్రకాష్, హేమలత , నాగమణి నేత, సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# నియోపోలిస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం





**- 17 ఏళ్ల విద్యార్థి మృతి**

**- కారులో ఎనిమిది మంది మైనర్లు ఉన్నట్లు పోలీసులు వెల్లడి**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నియోపోలిస్ వ్యూపాయింట్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 17 ఏళ్ల విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్యాహ్నం స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లిన విద్యార్థి అనంతరం స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. టిఎస్06ఎఫ్ఈ4545 నంబర్ గల కారు ఆదివారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటలకు నియోపోలీస్ జంక్షన్ నుంచి కోకాపేట్ లేక్‌వ్యూ పాయింట్ వైపు వెళ్తుండగా నియోపోలీస్ వ్యూపాయింట్ సమీపంలో ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో 17 ఏళ్ల విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో ఎనిమిది మంది మైనర్ విద్యార్థులు ప్రయాణిస్తున్నట్లు ప్రాథమికంగా తెలిసిందని పోలీసులు పేర్కొన్నారు. మృతుడు మద్యం సేవించి వాహనం నడిపినట్లు కూడా సమాచారం ఉందని తెలిపారు. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టమవుతుందని పోలీసులు వెల్లడించారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వాహనం పరిస్థితి, అందుబాటులో ఉన్న సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను సేకరిస్తున్నారు. ప్రమాదం ఎలా జరిగింది..? డ్రైవింగ్ సమయంలో పరిస్థితులు ఏమిటి..? తదితర అంశాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని తల్లిదండ్రులకు నార్సింగి పోలీసులు సూచించారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్? ధరించాలని సూచించారు. రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# మణికొండలో ఘనంగా ఉచిత మట్టి వినాయకుల పంపిణీ





**- పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులే మేలు**

**-- మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మట్టి వినాయకుల ప్రతిమలను ప్రతిష్ఠిద్దాం అనే సందేశంతో మణికొండలో ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ప్రతి ఏడాది వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న రామకృష్ణారెడ్డి.. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో కార్యక్రమాన్ని కొనసాగించారు. మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించడం ద్వారా చెరువులు, నీటి వనరులతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని ఆయన తెలిపారు. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. రసాయనాలతో తయారయ్యే విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుద్ధోలు శ్రీరాములు, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్, విజయ, విష్ణు తదితరులు పాల్గొన్నారు. ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను అందజేయడంపై భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**క్రైమ్ మిర్రర్,మంగపేట:** మండలంలోని మల్లూరు,కోమటి పల్లి గ్రామాలలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బాధిత కుటుంబాలను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు ,శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేష్ పార్టీ నాయకులతో కలిసి శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.మల్లూరు గ్రామంలో మృతురాలు బత్తుల ఆదిలక్ష్మి దశ దినకర్మలకు ఖర్చుల నిమిత్తం పార్టీ సీనియర్ నాయకులు పూజారి శ్రీను 25 కేజిల బియ్యం బాధిత కుటుంబానికి అందజేయగా రూ,5000/-నగదును బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులతో కలిసి బాడిశ నాగరమేష్ అందజేశారు.అదేవిధంగా కోమటిపల్లి గ్రామంలో మృతురాలు ముద్ధరబోయిన చంద్రమ్మ దశ దిన కర్మలకు రూ,5000/-నగదును వారి కుటుంబానికి నాగ రమేష్ అందజేశారు.ఈ సందర్భంగా బాడిశ నాగ రమేష్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ బాధిత కుటుంబాలకు,పేదలకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.ఈ



కార్యక్రమంలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పూజారి శ్రీను, మండల నాయకులు కుదురుపాక చిట్టిబాబు, దామోదర్, ఆనందం,సత్తార్ సఫీ, కృష్ణ, చంద్రకాంత్ మాజీ గ్రామకమిటీ అధ్యక్షులు గొల్లపల్లి శ్రీను,సోయం ఈశ్వర్,రూప భద్రయ్య, పాండ శ్రీను,కొమరం పుల్లారావు యూత్ నాయకులు అజ్జు, నవీన్, కుమార్ మరియు సోషియల్ మీడియా వారియర్ మునిగేలా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే మేలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమల పూజను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ధి సిటీజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను వితరణ చేశారు. కౌన్సిల్ అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి వినాయక ప్రతిమలను స్వీకరించారు. పురాణాల ప్రకారం పార్వతీదేవి మట్టితో వినాయకుడి ప్రతిమను రూపొందించి ప్రాణప్రతిష్ఠ చేసినట్లు చెబుతారని కౌన్సిల్ ప్రతినిధులు తెలిపారు. మట్టి నుంచి పుట్టి మట్టిలోనే కలిసిపోయే తత్వానికి ప్రతీకగా మట్టి వినాయకుడిని పూజించడం ఆధ్యాత్మికంగానే కాకుండా పర్యావరణ పరంగా కూడా ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. ప్రతి శుభకార్యాన్ని విఘ్నేశ్వరుడి పూజతో ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందని, అదే సమయంలో పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక ప్రతిమలను పూజించడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆరిఫ్



మహమ్మద్ మాట్లాడుతూ.. మట్టి వినాయక ప్రతిమల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. స్థానికులు సైతం మట్టి వినాయక ప్రతిమలను స్వీకరించి పూజించేందుకు తీసుకెళ్లడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు కోటేశ్వరరావు, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసన్, జగదీశ్, సుజాత, పారిజాతం, అనిత తదితరులు పాల్గొన్నారు.

# వార్డు 123లో భూగర్భ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** జీహెచ్‌ఎంసీ వార్డు నంబర్ 123 పరిధిలోని ఫీల్‌గుడ్ హోమ్స్ కాలనీ, పక్కనే నిర్మిస్తున్న నూతన కాలనీ మధ్య అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ విషయంలో నెలకొన్న వివాదానికి ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సమస్య కారణంగా గత కొన్ని నెలలుగా ప్రధాన రహదారిపై మురుగునీరు పొంగిపొర్లడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూగర్భ డ్రైనేజీ కనెక్షన్‌కు సంబంధించి ఏర్పడిన వివాదంతో డ్రైనేజీ పనులు గతంలో నిలిచిపోయాయి. దీంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి దుర్వాసనతో పాటు రాకపోకలకు అంతరాయం కలిగించింది. ఈ మార్గం ద్వారా ప్రతిరోజూ ప్రయాణించే ప్రజలు సమస్య పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సమస్యపై స్పందించిన ఎసిఎఫ్ జీహెచ్‌ఎంసీ 121, 122, 123 డివిజన్ల బృందాలు సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు, ఫీల్‌గుడ్ హోమ్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు శాఖతో చర్చలు చేపట్టాయి. పోలీసుల సమక్షంలో నిర్వహించిన ఉమ్మడి సమావేశాల్లో సమస్యపై అన్ని వర్గాలతో చర్చించి పరస్పర అంగీకారానికి వచ్చారు. దీంతో నిలిచిపోయిన భూగర్భ డ్రైనేజీ సీవరేజ్ లైన్ పనులను తిరిగి ప్రారంభించేందుకు ఫీల్‌గుడ్ హోమ్స్ అసోసియేషన్ అనుమతి ఇచ్చింది. భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయితే ప్రధాన రహదారిపై మురుగునీరు పొంగిపొర్లే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. దీంతో ఫీల్‌గుడ్ హోమ్స్ కాలనీతో పాటు సాయి బాలాజీనగర్, యాదయ్యనగర్, హిమగిరినగర్, కేకే నగర్-1, శ్రీనివాసనగర్, బైరాగిగూడ తదితర ప్రాంతాల ప్రజలకు ఊరట కలగనుంది. కీలక అనుసంధాన రహదారిలో రాకపోకలు సైతం సులభతరం కానున్నాయి. సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు కృషి చేసిన ఎసిఎఫ్ అధ్యక్షుడు వినయ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నదీమ్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌బాబు, ఈసీ సభ్యులు హరీష్‌గౌడ్, విజయ్ పద్మనాభం, జీహెచ్‌ఎంసీ డిఈఈతో పాటు సంబంధిత అధికారులు, ఫీల్‌గుడ్ హోమ్స్ అసోసియేషన్, పోలీసు శాఖకు కాలనీవాసులు, ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భూగర్భ డ్రైనేజీ పనులు తిరిగి ప్రారంభం కానుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# పుప్పలగూడలో కురుమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు

**- పాత కమిటీ సభ్యులకు ఘన సన్మానం**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పుప్పలగూడ గ్రామంలోని కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గత కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించి, వారు సంఘం అభివృద్ధికి చేసిన సేవలను అభినందించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పి. సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బట్ట మహేష్, ట్రెజరర్‌గా గుట్టమీది నరేందర్, కార్యదర్శిగా ఆర్. బాలకృష్ణ, ఉప కార్యదర్శిగా డి. శ్రీశైలం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. కురుమ సంఘం ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, సమాజ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మణికొండలో పైప్‌లైన్‌పై ప్రమాదకర గొయ్యి

**- పట్టించుకోకపోతే పెను ప్రమాదం జరిగే అవకాశం..**

**- చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ పట్టణంలోని ప్రధాన పైప్‌లైన్ వద్ద ప్రమాదకరంగా గొయ్యి ఏర్పడటంతో కంకణాల శివరాంరెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైప్‌లైన్‌పై ఏర్పడిన ఈ భారీ గొయ్యి కారణంగా అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులకు



ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. గొయ్యి స్పష్టంగా కనిపించకపోవడం లేదా సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా లేకపోతే అదుపుతప్పే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకరంగా మారిన గొయ్యిని పూడ్చడంతో పాటు పైప్‌లైన్ ప్రాంతంలో అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా సమస్యను తక్షణమే పరిష్కరించాలని కంకణాల శివరాంరెడ్డి విజ్ఞప్తి చేశారు.

